సాక్షి
కామారెడ్డి
సోమవారం ; 11 ; నవంబర్ ; 2024



నేటి నుంచి క్రీడా సంబురాలు

బోర్లం క్యాంప్ గురుకులంలో నేటి నుంచి జోనల్‌స్థాయి క్రీడాపోటీలు ప్రారంభం కానున్నాయి.

- 8లో ▸



క్రీడలతో బంగారు భవిష్యత్

చదువుతోపాటు క్రీడల్లో రాణిస్తే విద్యార్థుల భవిష్యత్ బంగారుమయమవుతుందని ఎమ్మెల్యే భూపతిరెడ్డి అన్నారు.

- 8లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
30.1 /15.4

ఉదయం ఆహ్లాదకరమైన గాలులు వీస్తాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. రాత్రి మంచుకురుస్తుంది. చలి తీవ్రత పెరుగుతుంది.

న్యూస్‌రీల్

శివాలయంలో న్యాయమూర్తి పూజలు



నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): మండలంలోని తాండూర్ శివారులో ఉన్న శ్రీత్రిలింగేశ్వరాలయంలో నిజామాబాద్ జిల్లా కోర్టు న్యాయమూర్తి సునీత కుంచాల ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్తీకమాసాన్ని పురస్కరించుకుని శివలింగానికి అభిషేకం చేశారు. పూజారి మల్లికార్జునప్ప న్యాయమూర్తికి తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఆలయ కమిటీ చైర్మన్ దత్తును ఆలయ చరిత్రను తెలిపారు. జడ్జి రాక సందర్భంగా నాగిరెడ్డిపేట, ఎల్లారెడ్డి ఎస్సైలు మల్లారెడ్డి, మహేశ్ బందోబస్తు ఏర్పాటు చేశారు.

నేడు ఉమ్మడి జిల్లాస్థాయి వాలీబాల్ పోటీలు

కామారెడ్డి టౌన్: గాంధారి మండలం పేట్ సంగంలో ఉమ్మడి జిల్లా స్థాయి వాలీబాల్ పోటీలను సోమవారం నిర్వహించనున్నట్లు ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి హీరాలాల్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అండర్ - 14 బాలబాలికల విభాగంలో పోటీలో పాల్గొనే క్రీడాకారులు ఒరిజినల్ బోనాఫైడ్ సర్టిఫికెట్‌తో హాజరుకావాలని సూచించారు.

మినిమం టైమ్ స్కేలు ఇప్పిస్తాం



కామారెడ్డి అర్బన్: కేజీబీవీ, మోడల్ స్కూళ్లలో పనిచేస్తున్న వారికి మినిమం టైమ్ స్కేల్ ఇప్పించే బాధ్యత తాము తీసుకున్నామని పీఆర్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పుల్గం దామోదర్‌రెడ్డి అన్నారు. కేజీబీవీ ఎస్‌వో, సీఆర్‌టీ, పీఈటీలు ఆదివారం కామారెడ్డిలో ఆత్మీయ సమ్మేళనం ఏర్పాటు చేయగా దామోదర్‌రెడ్డితోపాటు మాజీ ఎమ్మెల్సీ బి మోహన్‌రెడ్డి, కరీంనగర్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పీఆర్టీయూ అభ్యర్థి వంగ మహేందర్‌రెడ్డి పాల్గొన్నారు. కేజీబీవీ, మోడల్ స్కూళ్ల సిబ్బంది సమస్యలు తనకు తెలుసునని వాటి పరిష్కారానికి కృషి చేస్తామని దామోదర్‌రెడ్డి హామీ ఇచ్చారు. జిల్లా అధ్యక్షుడు ఏ కుషాల్, కేజీబీవీ అసోసియేషన్ అధ్యక్షురాలు వాసంతి, వనజ, పీఆర్టీయూ ప్రతినిధులు సుధారాణి, పుష్ప, ప్రశాంతి పాల్గొన్నారు.

విద్యా ప్రమాణాల పెంపు లక్ష్యంగా..

- స్కూళ్లు, కళాశాలలు, హాస్టళ్లలో ఆకస్మిక తనిఖీలు
- ఇంటర్ విద్యార్థులపై ప్రత్యేక దృష్టి
- ప్రతినెలా కళాశాలల్లో పేరెంట్స్ మీటింగ్ తప్పనిసరి
- ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులు
- విద్యార్థి గైర్హాజరైతే తల్లిదండ్రులకు ఫోన్
- కళాశాలల్లో పెరిగిన హాజరు శాతం
- కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ చొరవతో మొదలైన మార్పు

విద్యావ్యవస్థపై ప్రత్యేక దృష్టి సారించిన కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్.. బాధ్యతలు స్వీకరించిన నాలుగున్నర నెలల్లో 30 స్కూళ్లు, కళాశాలలు, గురుకులాలు, అంగన్‌వాడీ కేంద్రాలను తనిఖీ చేశారు. గతేడాది ఇంటర్ ఫలితాల్లో రాష్ట్రస్థాయిలో జిల్లా చివరి స్థానంలో ఉండడంతో ఆయన ఇంటర్ విద్యపై ప్రత్యేక దృష్టి సారించారు. ఈ నేపథ్యంలో జిల్లా ఇంటర్ విద్యాధికారి ప్రతి రోజూ ఓ కళాశాలను సందర్శిస్తున్నారు.



దోమకొండ కళాశాలలో విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడుతున్న కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ (ఫైల్)

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : ప్రభుత్వ విద్యా సంస్థల్లో ప్రమాణాలను మెరుగుపర్చడంపై కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ ప్రత్యేక దృష్టి సారించారు. తను జిల్లాలోని ఏ మండలానికి వెళ్లినా అక్కడి ప్రభుత్వ పాఠశాలలు, కాలేజీలు, గురుకులాలు, హాస్టళ్లను ఆకస్మికంగా తనిఖీ చేస్తున్నారు. తరగతి గదుల్లోకి వెళ్లి మాస్టారు అవతారం ఎత్తుతూ విద్యార్థులను ఆయా సబ్జెక్టులపై ప్రశ్నలు అడుగుతున్నారు. మౌళిక సదుపాయాలపై ఆరా తీస్తున్నారు. కొన్ని సమస్యలను అక్కడికక్కడే పరిష్కరిస్తున్న కలెక్టర్.. ప్రధానంగా జూనియర్ కళాశాలలపై ఫోకస్ పెడుతున్నారు. జిల్లాగా బాధ్యతలు స్వీకరించిన నాలుగున్నర నెలల్లో ఆయన ముప్పైస్కూళ్లు, కాలేజీలు, గురుకులలాలు, అంగన్‌వాడీలను తనిఖీ చేశారు. వారంలో రెండు రోజులైనా ఆయన తనిఖీలకు వెళ్తున్నారు. దీంతో కలెక్టర్ సార్ ఎప్పుడు తనిఖీకి వస్తారోనన్న భయం ఏర్పడిఉపాధ్యాయులు, అధ్యాపకులు సకాలంలో హాజరవుతున్నారు.

కలెక్టరేట్‌లోనూ..

జిల్లా పాలనావ్యవహారాలపై ప్రత్యేక దృష్టి సారించిన ఆశిష్ సంగ్వాన్ కలెక్టరేట్‌లో ఉద్యోగుల హాజరు కోసం బయోమెట్రిక్ అమలు చేశారు. ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణిలో అందే దరఖాస్తులను స్వీకరించి ఆయా మండలాల అధికారులతో నేరుగా మాట్లాడేందుకు ప్రత్యేక స్క్రీన్ ఏర్పాటు చేయించారు. జూమ్ ద్వారా ఆయా సమస్యలపై మాట్లాడి వాటి పరిష్కారానికి సూచనలు చేస్తున్నారు.

ప్రత్యేక తరగతులు

జూనియర్ కాలేజీల్లో ఉదయం, సాయంత్రం విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. ఉదయం 9 నుంచి 10 గంటల వరకు, అలాగే సాయంత్రం 3.30 నుంచి 4.30 గంటల వరకు స్టడీ అవర్స్ నిర్వహిస్తూ విద్యార్థుల పాఠనా సామర్థ్యాలు మెరుగుపడేలా చర్యలు తీసుకుంటున్నారు. జిల్లా ఇంటర్ నోడల్ అధికారి ప్రతి రోజూ ఏదో ఒక కాలేజీని విజిట్ చేయాల్సిందే. రోజూ తాను ఏ కాలేజీకి వెళ్లిందనేది లొకేషన్ చేయాలి. అలాగే ఫొటో దిగి జిల్లా కలెక్టర్‌కు వాట్సాప్ పంపించాలి. ఇది ప్రతీ రోజూ జరుగుతోంది.

మార్పు వస్తోంది



ప్రభుత్వ విద్యాసంస్థల్లో మంచి ఉపాధ్యాయులు, అధ్యాపకులు ఉన్నప్పటికీ చాలా చోట్ల విద్యార్థులు సరిగా హాజరు కావడం లేదు. ముఖ్యంగా జూనియర్ కాలేజీల్లో హాజరుశాతం తక్కువగా ఉంది. గతేడాది రిజల్ట్స్ చూస్తే ఇబ్బంది అనిపించింది. మెరుగైన ఫలితాలు సాధించాలంటే మార్పు తీసుకురావాలని అనుకున్నాను. పేరెంట్స్‌ను ఇన్‌వాల్వ్ చేశాం. విద్యార్థి గైర్హాజరైతే ఎందుకు రాలేదో కనుక్కుని, మరుసటి రోజు కచ్చితంగా హాజరయ్యేలా చూస్తున్నాం. ప్రతి నెలా పేరెంట్స్ మీటింగ్ తప్పనిసరి. విద్యార్థులకు సమయానికి బస్సులు లేవన్న ఫిర్యాదు నేపథ్యంలో ఆర్టీసీ అధికారులకు సూచనలు చేశాం. స్టడీ అవర్స్ నిర్వహిస్తున్నాం. ఇప్పటికే మార్పు కనబడింది. ఇంకా చాలా మారాల్సిన అవసరం ఉంది. కచ్చితంగా మంచి రిజల్ట్స్ సాధించేలా కార్యాచరణ ఉంటుంది. స్కూళ్లు, గురుకులాలు, హాస్టళ్లపైనా దృష్టి పెట్టాం. అంతటా మార్పు కనబడుతోంది.

– ఆశిష్ సంగ్వాన్, కలెక్టర్



బిచ్కుంద జూనియర్ కళాశాలలో స్టడీ అవర్స్‌ను పర్యవేక్షిస్తున్న నోడల్ అధికారి షేక్ సలాం

ఇంటర్‌పై ప్రత్యేక దృష్టి

గత విద్యాసంవత్సరంలో ఇంటర్మీడియట్ ఉత్తీర్ణతలో రాష్ట్రంలో జిల్లా అట్టడుగున ఉంది. ఫలితాలను గమనించిన కలెక్టర్ సంగ్వాన్ జూనియర్ కాలేజీలపై ప్రత్యేక దృష్టి సారించారు. ఇంటర్ నోడల్ అధికారి షేక్ సలాంను పిలిపించి కాలేజీలు, అధ్యాపకులు, సౌకర్యాలకు సంబంధించిన వివరాలను తీసుకున్నారు. జిల్లాలోని 20 జూనియర్ కాలేజీల ప్రిన్సిపాళ్లు, అధ్యాపకులతో సమావేశం ఏర్పాటు చేసి విద్యాప్రమాణాల మెరుగు కోసం తీసుకోవాల్సిన చర్యలపై దిశానిర్దేశం చేశారు. విద్యార్థులు తరగతులకు హాజరు కాకపోవడమే ఉత్తీర్ణత శాతం పడిపోవడానికి ప్రధాన కారణమని గుర్తించిన కలెక్టర్ కళాశాలల వారీగా వారి తల్లిదండ్రులతో సమావేశాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు.

దోమకొండ కళాశాలలో ఏర్పాటు చేసిన సమావేశానికి కలెక్టర్ సంగ్వాన్ స్వయంగా హాజరై విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో మాట్లాడారు. ప్రతి నెలా సమావేశాలు నిర్వహించిన విద్యార్థుల చదువు, హాజరుపై సమీక్షించాలని ఆదేశించారు. దీంతో జిల్లా అంతటా పేరెంట్స్ మీటింగ్‌లు ఏర్పాటు చేస్తున్నారు. విద్యార్థికి తరగతులకు గైర్హాజరైతే వెంటనే క్లాస్ లెక్చరర్ తల్లిదండ్రులకు ఫోన్ చేసి కారణంగా తెలుసుకుంటున్నారు. దీంతో 40 శాతానికి మించని హాజరుశాతం ప్రస్తుతం 60 శాతం దాటింది. కొన్ని కళాశాలల్లో 70 శాతానికి పైగా విద్యార్థులు హాజరవుతున్నారు.

సమగ్ర సర్వేపై అపోహలొద్దు

- ప్రతి కుటుంబం స్వచ్ఛందంగా వివరాలు తెలుపాలి
- సర్వే ఆధారంగా అర్హులకు సంక్షేమ పథకాలు
- ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీ



సర్వే ఫారంపై సంతకం చేస్తున్న షబ్బీర్ అలీ

కామారెడ్డి టౌన్: రాష్ట్రంలో కొనసాగుతున్న సమగ్ర కుటుంబ సర్వేపై ప్రజలు ఎలాంటి అపోహలు పెట్టుకొవద్దని, ప్రతిపక్షాలు తప్పుడు ప్రచారం చేస్తున్నాయని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ అన్నారు. ప్రతి ఒక్కరూ సర్వేకు సహకరించి వివరాలు చెప్పాలని కోరారు. జిల్లా కేంద్రంలోని ఆయన నివాసంలో స్థానిక సంస్థల జిల్లా అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, ఆర్డీవో రంగనాథ్‌రావు, టీపీవో గిరిధర్ బృందం ఆదివారం సమగ్ర సర్వే నిర్వహించగా, షబ్బీర్ అలీ పూర్తి వివరాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సమగ్ర సర్వేపై కొందరు అపోహలు సృష్టిస్తున్నారని అన్నారు. ఈ సర్వే ఆధారంగానే భవిష్యత్‌లో అర్హులకు పథకాలు అందుతాయన్నారు. ప్రణాళికబద్ధంగా ఇంటింటి సర్వేను నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. సర్వేలో సూపర్‌వైజర్లు, ఎన్యుమరేటర్లు పాల్గొన్నారు.

మాల్తుమ్మెదను మరిచారా?

- అధ్వానంగా మారిన ఉద్యానవనం
- గడ్డి, పిచ్చిమొక్కలతో నిండిన ఉద్యానక్షేత్రం పండ్ల తోటలు
- అడుగడుగునా కనిపిస్తున్న నిర్లక్ష్యం
- నిధులు లేకపోవడమే కారణమంటున్న అధికారులు



చెడిపోయి మూలనపడిన యంత్రపరికరాలు, ట్రాక్టర్, ట్రాలీ

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): మేలురకమైన పండ్లతోటలకు పేరుగాంచిన మండలంలోని మాల్తుమ్మెద ఉద్యానవన క్షేత్రం ప్రస్తుతం అధ్వానంగా మారింది. క్షేత్రంలోని పండ్లతోటలు గడ్డి, పిచ్చి మొక్కలతో నిండిపోయాయి. ఉద్యానక్షేత్రం నిర్వహణకు అవసరమైన బడ్జెట్ లేకపోవడం కారణంగానే గడ్డి, పిచ్చి మొక్కలను తొలగించలేకపోతున్నామని సంబంధిత అధికారి పేర్కొంటున్నారు. మాల్తుమ్మెద గ్రామశివారులోని విత్తనోత్పత్తిక్షేత్రానికి సంబంధించిన 60 ఎకరాల భూమిలో 1982లో ఉద్యానక్షేత్రాన్ని ఏర్పాటు చేశారు. అప్పట్లో మేలురకమైన పండ్లు, పూల మొక్కలను ఉత్పత్తి చేయడంతోపాటు ఉద్యానపంటల సాగుపై రైతులకు శిక్షణ సైతం ఇచ్చేవారు. ఒకప్పుడు 20మంది వరకు విధులు నిర్వహించిన ఉద్యానక్షేత్రంపై ఇప్పుడు నిర్లక్ష్యపు నీడ కమ్ముకుంది.

అభివృద్ధికి నిధుల కేటాయింపు

ఉద్యానవనక్షేత్రం అభివృద్ధికి 2014లో రూ.1.49 కోట్లు కేటాయించి పలు అభివృద్ధి పనులను చేపట్టారు. రోడ్లను బాగుచేయడంతోపాటు కార్యాలయాల భవనాలకు మరమ్మతులు చేపట్టారు. సోలార్ లైట్లు, సోలార్ బోరుమోటార్‌ను ఏర్పాటు చేశారు. అంటుకట్టిన మొక్కలను భద్రపర్చేందుకు మిస్ట్ చాంబర్‌ను, రైతులకు శిక్షణ ఇచ్చేందుకు ప్రత్యేక శిక్షణకేంద్రాన్ని సైతం ఏర్పాటు చేశారు. రెండు ట్రాక్టర్లతోపాటు ఇతర పరికరాలను కొనుగోలు చేశారు. ఉద్యానక్షేత్రంలో పంటలసాగు కోసం కొనుగోలు చేసిన యంత్రపరికరాలు ప్రస్తుతం చెడిపోయయి. ఫార్మేషన్ రోడ్లు పిచ్చిమొక్కలతో నిండిపోగా, షేడ్ నెట్లు సైతం పూర్తిగా ధ్వంసమయ్యాయి. ట్రాక్టర్లు, యంత్రపరికరాలు మరమ్మతులకు నోచుకోక మూలన చేరాయి.

వేధిస్తున్న అధికారుల కొరత

ఉద్యానక్షేత్రాన్ని అధికారుల కొరత వేధిస్తోంది. కొంతకాలం క్రితం ఉద్యానక్షేత్ర అధికారితోపాటు విస్తీర్ణ అధికారి, ఇద్దరు దినసరి కూలీలు విధులు నిర్వహించేవారు. ఉద్యానక్షేత్ర విస్తీర్ణ అధికారిని అప్పటి ప్రభుత్వం తొలగించగా, ఇటీవల జరిగిన బదిలీల్లో ఉద్యానక్షేత్ర అధికారి రామకృష్ణ వెళ్లిపోయారు. ఆయనస్థానంలో హెచ్‌వో కమలాకర్‌రెడ్డి ఇక్కడికి బదిలీపై వచ్చారు. కొంతకాలంపాటు విధులు నిర్వర్తించిన ఆయనను సైతం అధికారులు బదిలీ చేశారు. దీంతో సదాశివనగర్ హెచ్‌వో హర్షవర్ధన్ రెడ్డికి ఉద్యానక్షేత్ర ఇన్‌చార్జి బాధ్యతలను అప్పగించారు. ఆయనే ఎల్లారెడ్డి ఇన్‌చార్జి హెచ్‌వోగా సైతం కొనసాగుతున్నారు. ప్రస్తుతం క్షేత్రంలో ఇద్దరు దినసరి కూలీలు మాత్రమే పనిచేస్తున్నారు. గడ్డి, పిచ్చిమొక్కలు దట్టంగా పెరగడంతో ఉద్యానక్షేత్రం అడవిపందులకు స్థావరంగా మారింది. పండ్లమొక్కల ఎదుగుదలపై తీవ్ర ప్రభావం పడుతోంది.



మామిడితోటలో పెరిగిన గడ్డి, పిచ్చిమొక్కలు



రోడ్డు కనిపించకుండా పెరిగిన పిచ్చి మొక్కలు

“ నిధులు కేటాయించగానే పనులు చేయిస్తాం

ఉద్యానక్షేత్రంలో పనులు చేపట్టేందుకు అవసరమైన నిధుల కోసం గతంలో ఇక్కడ పనిచేసిన అధికారులు ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపారు. ప్రస్తుతం నిధులు లేకపోవడం కారణంగానే పనులు చేయలేకపోతున్నాం. నిధులు మంజూరైన వెంటనే పనులు చేయిస్తాం.

– హర్షవర్ధన్‌రెడ్డి, ఉద్యానక్షేత్ర అధికారి, మాల్తుమ్మెద

నదులు కలుషితం కాకుండా చూడాలి

- హరియాణా గవర్నర్ బండారు దత్తాత్రేయ



కందకుర్తి త్రివేణి సంగమంలో గోదావరికి హారతి ఇస్తున్న హరియాణా గవర్నర్ బండారు దత్తాత్రేయ

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్/రెంజల్: నదులు కలుషితం కాకుండా చూడాల్సిన బాధ్యత అందరిపై ఉందని హరియాణా గవర్నర్ బండారు దత్తాత్రేయ అన్నారు. రెంజల్ మండలంలోని కందకుర్తి గ్రామంలో ఆదివారం ఆయన పర్యటించారు. త్రివేణి సంగమం (గోదావరి, మంజీర, హరిద్ర నదులు కలిసే చోటు) వద్ద గోదావరి హారతి కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రకృతిని పూజిస్తే ధన్యత లభిస్తుందన్నారు. నదీ జలాలను సద్వినియోగం చేసుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వాలు మరిన్ని చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం ఆర్‌ఎస్‌ఎస్ వ్యవస్థాపకులు కేశవ బలిరామ్ పంత్ హెడ్గేవార్ పూర్వీకుల ఇంటి స్థలంలో నిర్మిస్తున్న స్ఫూర్తి కేంద్రాన్ని సందర్శించారు. హెడ్గేవార్ మూలాలు తెలంగాణవి కావడం మనందరికీ గర్వకారణమన్నారు. తాను ప్రస్తుతం రాజ్యాంగబద్ధమైన పదవిలో ఉన్నప్పటికీ ఎప్పటికీ స్వయం సేవక్‌నేనని అన్నారు. ఆర్‌ఎస్‌ఎస్ కారణంగానే ఈ స్థాయికి వచ్చిన్నట్లు తెలిపారు.

పర్యాటక కేంద్రంగా అభివృద్ధి

కందకుర్తిని పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయడానికి కేంద్ర సాంస్కృతిక శాఖతో మాట్లాడుతానని దత్తాత్రేయ పేర్కొన్నారు. కందకుర్తిలో రూ.40 కోట్లతో శిక్షణ కేంద్రాల నిర్వహణ అభినందనీయమన్నారు. డాక్టర్ హెడ్గేవార్ వ్యక్తి నిర్మాణం కోసం పని చేశారని వివరించారు. విద్య, ఉపాధి ద్వారానే నిరుద్యోగ సమస్యకు పరిష్కారం లభిస్తుందన్నారు. బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి మాట్లాడుతూ.. గ్రామంలో చేపడుతున్న అభివృద్ధి పనులకు తనవంతు సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. స్థానికులు ఆయన దృష్టికి పలు సమస్యలను తీసుకొచ్చారు. సానుకూలంగా స్పందించిన ఎమ్మె ల్యే పనులను పూర్తి చేయిస్తానన్నారు. హెడ్గేవార్ మనవడు దిలీప్ శాస్త్రి హెడ్గేవార్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా కేంద్రంలో సదర్ సందడి



కామారెడ్డి టౌన్: జిల్లా కేంద్రంలో మొట్టమొదటిసారి గోకుల్ సేవా యాదవ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి సదర్ పండుగను ఘనంగా నిర్వహించారు. వీక్లి మార్కెట్‌లో దున్నపోతులకు పూజలు నిర్వహించి డీజే సౌండ్‌తో నృత్యాలు చేసుకుంటూ పుర వీధుల గుండా ర్యాలీ నిర్వహించారు. పట్టణంలో సదర్ సందడి నెలకొంది. కార్యక్రమంలో లక్ష్మణ్‌యాదవ్, రాజు, వెంకట్, భూమేశ్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

విశ్వగురువు చేయడమే లక్ష్యం

- హిందూ సంఘటనం కోసం ఆర్‌ఎస్‌ఎస్ పనిచేస్తోంది
- హిందువులను విచ్ఛిన్నం చేసేందుకు పలుదేశాల కుట్రలు
- ఆర్‌ఎస్‌ఎస్ తెలంగాణ సహ ప్రాంత ప్రచారక్ కల్పగురి ప్రభుకుమార్
- నగరంలో ఆకట్టుకున్న పథ సంచలన్



ప్రభుత్వ ఐటీఐ కళాశాల మైదానంలో స్వయం సేవకుల విన్యాసాలు

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్ : భారత్‌ను విశ్వగురువు స్థానంలో నిలబెట్టడమే లక్ష్యంగా రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆర్‌ఎస్‌ఎస్) వందేళ్లుగా కృషి చేస్తోందని ఆ సంస్థ తెలంగాణ సహ ప్రాంత ప్రచారక్ కల్పగురి ప్రభుకుమార్ తెలిపారు. ఆదివారం ఇందూరు నగరంలో ఆర్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో మహాపథ సంచలన్ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో కళాశాల విద్యార్థి శిబిర సార్వజనికోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుకుమార్ మాట్లాడుతూ.. వెయ్యేళ్ల బానిసత్వానికి ముందున్న జగద్గురు స్థానానికి భారత్‌ను తీసుకెళ్లేందుకు ఆర్‌ఎస్‌ఎస్ కృషి చేస్తోందన్నారు. ఆర్‌ఎస్‌ఎస్ సంపూర్ణ హిందూ సంఘటనతోనే నేడు హిందుత్వం ప్రపంచవ్యాప్తమైందన్నారు. ప్రస్తుతం సంఘ్ గురించి ప్రపంచవ్యాప్తంగా చర్చ నడుస్తోందన్నారు. 1925 విజయదశమి రోజున హెడ్గేవార్ ఆర్‌ఎస్‌ఎస్‌ను స్థాపించకముందు హిందుత్వ గురించి పలకాలంటేనే అడుగడుగునా ఆలోచించే పరిస్థితి ఉండేదన్నారు.

కులాల పేరుతో విభజించే కుట్ర

భారత్‌లో హిందువులను కులాల పేరుతో, సంస్కృతి పరంగా విభజించేందుకు కొన్ని దేశాలు కుట్రలు చేస్తున్నాయని ప్రభుకుమార్ ఆరోపించారు. లవ్ జిహాద్, ల్యాండ్ జిహాద్, జనాభా జిహాద్ పేరిట అడుగడుగునా హిందు మతంపై కొందరు దాడి చేస్తున్నారన్నారు. కొందరు కుటుంబాల బలహీనతలను ఆసరాగా చేసుకుని మతమార్పిడులు చేస్తున్నారని ఆరోపించారు.

పూర్వీకుల గురించి తెలుసుకోవాలి

కుటుంబ వ్యవస్థను పటిష్టంగా ఉంచేందుకు ఆర్‌ఎస్‌ఎస్ కృషి చేస్తోందన్నారు. మన పూర్వీకుల గురించి చర్చ జరిగితేనే శివాజీ, వివేకానంద స్వామీజీ లాంటి వారు తయారవుతారన్నారు. వ్యక్తిగత జీవితం కన్నా దేశ క్షేమమే లక్ష్యంగా పనిచేయాల్సిన ఆవశ్యకత ఉందన్నారు.

మహా పథ సంచలన్‌లో ఎమ్మెల్యే ధన్‌పాల్

నగరంలోని మూడు ప్రాంతాల నుంచి మొదలైన స్వయంసేవక్‌ల పథ సంచలన్ శివాజీనగర్ చౌక్ (ఆర్‌ఆర్ చౌక్) వద్ద త్రివేణి సంగమం మాదిరిగా కలిసి ఐటీఐ కళాశాల మైదానానికి చేరుకుంది. స్వయంసేవక్‌ల విన్యాసాలు ఆకట్టుకున్నాయి.



ఆర్‌ఆర్ చౌరస్తాలో పథ సంచలన్

క్లుప్తంగా

దత్తోపంత్ బాపురావ్ టెంగ్డి సేవలు చిరస్మరణీయం



కామారెడ్డి అర్బన్: భారతీయ కార్మిక సంఘం, స్వదేశీ జాగరణ్ మంచ్, భారతీయ మద్దూర్ సంఘ్, భారతీయ కిసాన్ సంఘ్‌ల వ్యవస్థాపకులు దత్తోపంత్ బాపురావ్ టెంగ్డి జయంతి సందర్భంగా ఆదివారం స్థానిక సరస్వతి విద్యామందిర్‌లో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. స్వదేశీ జాగరణ్ మంచ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో దత్తోపంత్ భారతావనికి అందించిన సేవలు చిరస్మరణీయమని ఇందూర్ విభాగ్ సహ సంయోజక్ రాజాగౌడ్ కొనియాడారు. జిల్లా సంయోజక్ డాక్టర్ వంగ రాహుల్ కుమార్, వీహెచ్‌పీ జిల్లా ఉపాధ్యక్షుడు సామల గంగారెడ్డి, స్వదేశీ జాగరణ్ మంచ్ జిల్లా సభ్యులు రాజేశ్వర్, లక్ష్మీనారాయణ, శ్రీనివాస్, ప్రిన్సిపాల్ నాగభూషణం పాల్గొన్నారు.

సామూహిక సత్యనారాయణ వ్రతాలు



కామారెడ్డి రూరల్: కార్తీక మాసం సందర్భంగా ఆదివారం గర్గుల్ గ్రామంలోని శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి దేవస్థానంలో గోవిందమాంబ సమేత వీరబ్రహ్మేంద్ర స్వామి వారికి ప్రత్యేక పూజలు చేసి, సామూహిక సత్యనారాయణ వ్రతాలు నిర్వహించారు. అనంతరం కార్తీక వనభోజనాలు చేశారు.

దామోదర దీపోత్సవం



కామారెడ్డి అర్బన్: అంతర్జాతీయ శ్రీకృష్ణ చైతన్య సంఘం(ఇస్కాన్) కామారెడ్డి కేంద్రంలో ఆదివారం శ్రీదామోదర దీపోత్సవం నిర్వహించారు. దీపోత్సవం సందర్భంగా భక్తులు భజనలు, కీర్తనలు, నృత్యాలు చేశారు. అనంతరం తీర్థప్రసాదాలు, అన్నప్రసాదం అందజేశారు.

ఘనంగా రేణుకా ఎల్లమ్మ ఉత్సవాలు



సదాశివనగర్(ఎల్లారెడ్డి): భూంపల్లిలో గౌడ సంఘం ఆధ్వర్యంలో రేణుకా ఎల్లమ్మ ఉత్సవాల్లో భాగంగా ఆదివారం పోచమ్మలకు బోనాలను సమర్పించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. సోమవారం రాత్రి ఎల్లమ్మ ఒగ్గుకథను నిర్వహించనున్నట్లు గౌడ సంఘం ప్రతినిధులు తెలిపారు.

పట్టుబడ్డ పీడీఎస్ బియ్యం 1470.20 క్వింటాళ్లు

వేల్పూర్: మండల కేంద్రంలోని వజ్ర రైసుమిల్లులో పట్టుబడ్డ పీడీఎస్ బియ్యం 1470.20 క్వింటాళ్లుగా తేలిందని ఎస్సై నాగ్‌నాథ్ ఆదివారం రాత్రి తెలిపారు. శుక్రవారం పట్టు బడ్డ పీడీఎస్ బియ్యాన్ని ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు ఆదివారం రాత్రి వరకు లెక్కించినట్లు పేర్కొన్నారు. దీంతో అక్రమంగా పీడీఎస్ బియ్యాన్ని నిల్వ ఉంచిన రైసుమిల్లు వేంపల్లి వంశీకృష్ణపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

నేటినుంచి క్రీడా సంబురాలు

- కామారెడ్డి, సిద్దిపేట జిల్లాల నుంచి 1,250 మంది రాక
- బోర్లంలోని సోషల్ వెల్ఫేర్ పాఠశాలలో జోనల్‌స్థాయి క్రీడాపోటీలు



కీడాపోటీలకు సిద్ధమైన ప్రాంగణం



ప్రాక్టీస్ చేస్తున్న క్రీడాకారిణులు

బాన్సువాడ రూరల్: మండలంలోని బోర్లం క్యాంపు తెలంగాణ సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల మైదానంలో సోమవారం నుంచి 14వ తేదీ వరకు 10వ జోనల్‌స్థాయి క్రీడాపోటీలు ప్రారంభం కానున్నాయి. కామారెడ్డి, సిద్దిపేట జిల్లాల్లోని 15 పాఠశాలలకు చెందిన సుమారు 1250 మంది క్రీడాకారులు పాల్గొననున్నారు.

మూడు విభాగాల్లో పోటీలు

బాలికలకు అండర్ – 14, 17, 19 విభాగాల్లో అథ్లెటిక్స్ , స్పోర్ట్స్ అండ్ గేమ్స్ పోటీలు నిర్వహిస్తారు. దీనిలో భాగంగా అథ్లెటిక్స్‌లో లాంగ్‌జంప్, హైజంప్, రన్నింగ్ (100 మీటర్లు, 400 మీటర్లు), షార్ట్‌పుట్ పోటీలు నిర్వహిస్తారు. అలాగే కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, హ్యాండ్‌బాల్, బాల్‌బ్యాడ్మింటన్‌తోపాటు చెస్, క్యారం తదితర పోటీలు నిర్వహించనున్నారు.

ఏర్పాట్లు పూర్తి.. తరలివచ్చిన క్రీడాకారిణులు

జోనల్‌స్థాయి క్రీడాపోటీల నిర్వాహణ కోసం గత వారం రోజులుగా ఇన్‌చార్జి ప్రిన్సిపల్ రమాదేవి, జోనల్ స్థాయి స్పోర్ట్ నిర్వాహణకు ప్రత్యేకంగా నియమించిన పూర్వ ప్రిన్సిపల్ పద్మకుమారి ఆధ్వర్యంలో ఏర్పాట్లు కొనసాగుతున్నాయి. గ్రౌండ్‌ను చదును చేయించారు. విద్యార్థులు, పీఈటీ, ఇతర ఎస్కార్ట్ ఉపాధ్యాయులతో కలిసి ప్రత్యేక వాహనాల్లో బోర్లం క్యాంపునకు చేరుకున్నారు. సోమవారం ఉదయం క్రీడా సంబురాలను బాన్సువాడ ఎమ్మెల్యే, రాష్ట్ర వ్యవసాయ సలహాదారు పోచారం శ్రీనివాస్‌రెడ్డి అట్టహాసంగా ప్రారంభించనున్నారు. ఈనెల 14న నిర్వహించే బహుమతి ప్రదానోత్సవం, ముగింపు వేడుకలకు సైతం ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి హాజరవుతారని నిర్వాహకులు తెలిపారు.

విజయవంతం చేయాలి

జోనల్‌స్థాయి క్రీడాపోటీలను విజయవంతంగా పూర్తిచేసేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలి. క్రీడాకారులకు ఎలాంటి ఇబ్బంది కలుగకుండా స్థానిక అధ్యాపకులు, సిబ్బందితో కలిసి ఏర్పాట్లు చేశాం. క్రీడాకారులకు, వారితో పాటు వచ్చిన పీఈటీ, ఎస్కార్ట్ అధ్యాపకులు, అధికారులకు ప్రతిరోజూ ప్రత్యేక మెనూ ప్రకారం పౌష్టిక ఆహారం, పండ్లు, గుడ్లు, చికెన్‌తో కూడిన ప్రత్యేక వంటకాలు అందించనున్నాం.

– పద్మకుమారి, జోనల్ స్పోర్ట్స్ ఇన్‌చార్జి ప్రిన్సిపాల్

క్రీడలతో బంగారు భవిష్యత్తు

- అట్టహాసంగా ఖైసర్ అకాడమీ ఆధ్వర్యంలో టోర్నీని ప్రారంభించిన ఎమ్మెల్యే భూపతిరెడ్డి



మాట్లాడుతున్న రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి

నిజామాబాద్‌నాగారం: చదువుతో పాటు క్రీడల్లో రాణిస్తే భవిష్యత్తు బంగారుమయంగా ఉంటుందని, క్రీడాకారులను ప్రోత్సహించడానికి ఖైసర్ తన అకాడమీ ఆధ్వర్యంలో టోర్నమెంట్ నిర్వహించడం అభినందనీయమని నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి అన్నారు. ఆదివారం నగరంలోని రాజారాం స్టేడియంలో భారత రత్నా మౌలానా అబుల్ కలామ్ ఆజాద్ మెమోరియల్ అథ్లెటిక్స్ టోర్నమెంట్‌ను ఖైసర్ స్పోర్ట్ అకాడమీ ఆధ్వర్యంలో జాతీయ అథ్లెటిక్ గోల్డ్‌మెడలిస్టు సయ్యద్‌ఖైసర్ నిర్వహిస్తున్నారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే హాజరై క్రీడా జ్యోతిని వెలిగించి ప్రారంభించారు. క్రీడాకారులకు ఖైసర్ అండగా ఉండడం చాలా సంతోషంగా ఉందన్నారు. క్రీడాకారులు వచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. పోటీలకు 79 పాఠశాల నుంచి 1882మంది విద్యార్థులు హాజరయ్యారు. నిజామాబాద్, హైదరాబాద్, కామారెడ్డి, ఎల్లారెడ్డి, బోధన్, ఆర్మూర్, బాల్కొండ, బాన్సువాడ, కోటగిరి తదితర ప్రాంతాల నుంచి వచ్చారు. క్రీడాకారులకు అథ్లెటిక్స్‌లో రన్నింగ్ పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో నిజామాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ముప్పగంగారెడ్డి, డీసీసీ డెలిగేట్ శేఖర్‌గౌడ్, కాలూరు మాజీ సర్పంచ్ అగ్గు బోజన్న, రాజేందర్, పీడీ, పీఈటీలు పాల్గొన్నారు.



పరుగుపందెం పోటీలో తలపడుతున్న క్రీడాకారులు

అ'పూర్వ' సమ్మేళనం



సమ్మేళనంలో పాల్గొన్న వివేకానంద పాఠశాల విద్యార్థులు

నిజామాబాద్‌అర్బన్: నగరంలోని వివేకానంద పాఠశాలలో 1997–98లో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఆదివారం అపూర్వ సమ్మేళనం నిర్వహించారు. చిన్ననాటి మిత్రులందరూ ఒకే చోట కలవడంతో సంతోషం వ్యక్తం చేశారు. నాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ రవికాంత్, ఉపాధ్యాయులు శ్రీకాంత్, నారాయణ్ రావు, పరమేశ్వర్, చింతల శ్రీనివాస్, నిశిత, సుమతి, ప్రేమలత, రామరాణి, పూర్వ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు. నగరంలోని రాధాకృష్ణ విద్యాలయంలో 1990కు చెందిన ఏడో తరగతి పూర్వ విద్యార్థులు సమ్మేళనం నిర్వహించారు. నాటి టీచర్లను సన్మానించారు. ప్రవీణ్, రాజు, అజయ్, రజిని, సునీత, జమున పాల్గొన్నారు.



రాధాకృష్ణ పాఠశాలలో..

రైతులకు ఇబ్బందులు కలగకుండా చూడాలి



పెద్దకొడప్‌గల్‌లో కొనుగోళ్లను పరిశీలిస్తున్న తహసీల్దార్ దశరథ్



ఆరేపల్లిలో వరి కొనుగోలు కేంద్రం వద్ద అధికారులు

పెద్దకొడప్‌గల్(జుక్కల్): కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని తహసీల్దార్ దశరథ్ సూచించారు. ఆదివారం స్థానిక ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. కొనుగోళ్ల వేగవంతం చేయాలన్నారు.ఆర్‌ఐ అంజయ్య, రైతులు పాల్గొన్నారు.

ఆరేపల్లిలో..

రాజంపేట: ఆరేపల్లిలో వరి కొనుగోలు కేంద్రాన్ని తహసీల్దార్ అనిల్ కుమార్, ఆర్‌ఐ లక్ష్మయ్య సందర్శించారు. తేమశాతం, తరుగు, లారీల విషయాలను రైతులను అడిగి తెలుసుకున్నారు.

గాంధారిలో..

గాంధారి(ఎల్లారెడ్డి): కొనుగోలు కేంద్రాల్లో రైతులు ఇబ్బందులు లేకుండా చూడాలని తహసీల్దార్ సతీష్‌రెడ్డి సూచించారు. ఆదివారం ఆయన ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమంలో భాగంగా గుర్జాల్ తండా, రాంలక్ష్మణ్‌పల్లి, మాతుసంగెం గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా పోలింగ్, ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించారు. ఆయన వెంట డీటీ రవి, తదితరులున్నారు.

కొనుగోలు కేంద్రం ప్రారంభం

తాడ్వాయి(ఎల్లారెడ్డి): ప్రభుత్వం ప్రవేశ పెట్టిన పథకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సింగిల్ విండో చైర్మన్ నల్లవెల్లి కపిల్‌రెడ్డి అన్నారు. తాడ్వాయి మండల కేంద్రంతో పాటు సోమారం గ్రామంలో ఆదివారం సింగిల్‌విండో ఆధ్వర్యంలో వడ్ల కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలలోనే విక్రయించాలని సూచించారు. కార్యదర్శి నర్సింలు, నికిత్‌రెడ్డి, డైరెక్టర్లు, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.



రాంలక్ష్మణ్‌పల్లిలో కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ సతీష్‌రెడ్డి, డీటీ రవి



సోమారంలో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న చైర్మన్ కపిల్ రెడ్డి

సమగ్ర సర్వేను స్వాగతించాలి



మాట్లాడుతున్న ధర్మసమాజ్ పార్టీ జిల్లా నాయకులు



మాట్లాడుతున్న రాజయ్య

కామారెడ్డిఅర్బన్/తాడ్వాయి(ఎల్లారెడ్డి): ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న సమగ్ర సర్వేను ప్రజలు స్వాగతించాలని ధర్మ సమాజ పార్టీ తాడ్వాయి మండల అధ్యక్షుడు రాజశేఖర్, జిల్లా కన్వీనర్ బోలేశ్వర్‌లు అన్నారు. వారు ఆదివారం తాడ్వాయి, కామారెడ్డిలలో వేర్వేరుగా మాట్లాడారు. కులగణన వల్ల బీసీ, ఎస్సీ, ఎస్టీల జనాభా లెక్క తేలుతుందని, రిజర్వేషన్లు, సామాజిక స్థితిగతులు తెలుస్తాయన్నారు. సర్వే సిబ్బందికి సహకరించి వివరాలు అందించాలన్నారు.

సర్వే హర్షణీయం

తాడ్వాయి(ఎల్లారెడ్డి): రాష్ట్ర ప్రభుత్వం సమగ్ర సర్వే చేపట్టడం హర్షణీయమని చాకలి ఎస్సీ సాధన కమిటీ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ రాజయ్య అన్నారు. కృష్ణాజివాడిలో ఆదివారం ఆయన మాట్లాడారు. సర్వేతో అన్నివర్గాల వారికి న్యాయం జరుగుతుందన్నారు. ఈ సర్వే చేపట్టినందుకు సీఎం రేవంత్‌రెడ్డి, ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. రాజయ్య, బాలయ్య, సంతోష్, విఠల్, రాములు, పోశయ్య, తదితరులు పాల్గొన్నారు.

కేజీబీవీ వద్ద తల్లిదండ్రుల పడిగాపులు



గేటు వద్ద వేచి చూస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులు

కామారెడ్డి రూరల్: టేక్రియాల్ కస్తూర్బా పాఠశాల వద్ద ఆదివారం విద్యార్థుల తల్లిదండ్రులు 5 గంటల పాటు పడిగాపులు కాశారు. ప్రతి రెండో శనివారం, ఆదివారం విద్యార్థులను చూడడానికి తల్లిదండ్రులను అనుమతిస్తారు. వారు ఉదయం 10 గంటలకే చేరుకున్నా పాఠశాల గేటుకు తాళం వేసి ఉండడంతో 5 గంటల పాటు ఎండలోనే వేచి చూడాల్సి వచ్చింది. ఎవరూ అందుబాటులో లేకపోవడంతో తల్లిదండ్రులకు పడిగాపులు తప్పలేదు. విద్యార్థుల తల్లిదండ్రులు ప్రిన్సిపాల్‌కు ఫోన్ చేస్తే ఎట్టకేలకు మధ్యాహ్నం 2 గంటలకు గేటు తాళం తీశారు. దీంతో తల్లిదండ్రులు వారి పిల్లలను చూసి వెళ్లారు. చలికాలం హాస్టల్‌లో వేడి నీళ్లు రావడం లేదని, చల్లటి నీళ్లతోనే స్నానం చేయాల్సి వస్తోందని పిల్లల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అయితే వేడి నీళ్ల గీజర్ ఏర్పాటు కోసం ఒక్కో విద్యార్థి నుంచి రూ.500 చొప్పున వసూలు చేసినట్లు కొందరు తల్లిండ్రులు చెబుతున్నారు. అయినా చల్లటి నీళ్లతోనే స్నానాలు చేస్తున్నారని పేర్కొన్నారు. ఉన్నతాధికారులు స్పందించి హాస్టల్‌లో సరైన సౌకర్యాలు ఉండేలా చూడాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరారు.

వర్గీకరణపై తొందరపాటు నిర్ణయం సరికాదని చెప్పా

నిజామాబాద్ నాగారం: వర్గీకరణపై సుప్రీం తీర్పు వచ్చాక మాలజాతిలో అభద్రత నెలకొందని, తొందరపాటుతో ఎస్సీ వర్గీకరణపై నిర్ణయం తీసుకోవడం సరికాదని సీఎం రేవంత్‌రెడ్డికి చెప్పినట్లు చెన్నూరు ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి అన్నారు. నిజామాబాద్ నగరంలో మాల ఉద్యోగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. మాలల ఐక్యతను చీల్చడానికి కుట్రలు జరుగుతున్నాయని, మనమందరం ఐక్యంగా ఉంటు నిరసనలు, ఆందోళనలతో మన సత్తా చాటాలని అన్నారు. ఇప్పుడు మాల జాతి మేల్కోకపోతే భవిష్యత్ అగాధంలో పడుతుందన్నారు. సొంత పనులు పక్కన పెట్టాల్సిన సమయం వచ్చిందని చెప్పారు. అన్ని రాజకీయ పార్టీలకు మన సత్తా అర్థమయ్యేలా పోరాటాలు చేయాలని సూచించారు. ఎస్సీ వర్గీకరణ అంశంపై కేంద్రం చిన్నచూపు చూస్తోందని అన్నారు. డిసెంబర్ 1న హైదరాబాద్‌లో తలపెట్టిన సభను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు చెన్నయ్య, అలుక కిషన్, ఎడ్ల నాగరాజు, అమృత్, అంగరి ప్రదీప్, విజయ్, ఎల్లన్న, రాంచందర్, స్వా మిదాస్, దేవిదాస్, సర్వయ్య, విజయ్‌కుమార్, జయ్‌పాల్, సుంకరిమోహన్ పాల్గొన్నారు.

4.2 కిలోల గంజాయి పట్టివేత



గంజాయిని పట్టుకున్న ఎక్సైజ్ అధికారులు

ఖలీల్‌వాడి: నగరంలోని మాధవనగర్ వద్ద గంజాయి తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను ఎక్సైజ్ పోలీసులు అరెస్టు చేశారు. వారు తెలిపిన వివరాల ప్రకారం.. కంఠేశ్వర్ బైపాస్ నుంచి మాధవనగర్ వెళ్లే మార్గంలో శనివారం సాయంత్రం బైక్‌పై వెళ్తున్న సర్ఫరాజ్‌ఖాన్‌ను తనిఖీ చేయగా అతడి వద్ద 2.1 కిలోల గంజాయి లభ్యమైందని ఎక్సైజ్ ఎస్‌హెచ్‌వో దిలీప్ ఆదివారం తెలిపారు. సర్ఫరాజ్‌ఖాన్‌ను విచారించగా మహారాష్ట్రలోని నాందేడ్ నుంచి తీసుకొచ్చి ఇక్కడ అధిక లాభాలకు అమ్ముతున్నట్లు చెప్పారు. అదేమార్గంలో ఆటోలో గంజాయి వస్తుందనే సమాచారం మేరకు తనిఖీ చేయగా ద్వారకానగర్‌కి చెందిన సాజిత్‌అలీ ఆటోను వదిలి పారిపోయాడు. ఆటోలో 2.1 కేజీల గంజాయి లభించింది. ఈ రెండు కేసుల్లో 4.2 కేజీల గంజాయి, ఒక పల్సర్ బైక్, ఒక ఆటోను సీజ్ చేసినట్లు తెలిపారు. సర్ఫరాజ్‌ఖాన్‌ను అరెస్టు చేసి, కోర్టులో హాజరుపర్చినట్లు పేర్కొన్నారు. తనిఖీల్లో నిజామాబాద్ ఎక్సైజ్ ఎస్సై మల్లేశ్, సిబ్బంది షబ్బీర్, ప్రభాకర్, దార్‌సింగ్, రవి, సంగయ్య, సౌమ్య పాల్గొన్నారు.

పోలీస్ వాహనంలో క్షతగాత్రుల తరలింపు



మద్నూర్: లా అండ్ ఆర్డర్‌ను కాపాడడం పోలీసులకు ఎంత బాగా తెలుసో అలాగే ఆపదలో ఉన్న వారిని రక్షించడం కూడా తమ కర్తవ్యమని మద్నూర్ పోలీసులు అంటున్నారు. మండల కేంద్రానికి సమీపంలో ఉన్న మద్నూర్–బిచ్కుంద జాతీయ రహదారిపై ఆదివారం ప్రయాణికులతో వెళ్తున్న ఆటో బోల్తా పడింది. అదే సమయంలో అటుగా వెళ్తున్న ఎస్సై విజయ్‌కొండ ప్రమాదాన్ని గమనించి పోలీస్ వాహనాన్ని నిలిపి ప్రమాదంలో గాయపడిన వారిని తన వాహనంలో ఆస్పత్రికి తరలించారు. ప్రమాదంలో గాయపడిన వారి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు. ఆపదలో ఉన్న వారిని రక్షించిన పోలీసులను స్థానికులు అభినందనలు తెలిపారు.

క్రైం కార్నర్

ఈత కోసం వెళ్లి అనంత లోకాలకు..



శివానంద్(ఫైల్)

నిజాంసాగర్: ఈత కోసం వెళ్లిన గునుకుల్ శివానంద్(17) అనే ఇంటర్ విద్యార్థి నీట మునిగి మృతి చెందిన ఘటన ఆదివారం మండలంలోని మల్లూరు గ్రామ శివారులోని మంజీరా నది వద్ద జరిగింది. స్థానికుల కథనం ప్రకారం.. మహమ్మద్నగర్ మండలంలోని కొమలంచ గ్రామానికి చెందిన గునుకుల్ మొగులవ్వ, పోచయ్య దంపతుల కుమారుడు శివానంద్ బాన్సువాడ పట్టణంలోని ప్రైవేట్ కళాశాలలో ఇంటర్ సెకండియర్ చదువుతున్నాడు. ఆదివారం మధ్యాహ్నం మల్లూరుకు చెందిన ఒకరితో కలిసి గ్రామ శివారులోని మంజీరా నది వద్దకు వచ్చారు. నదిలోని మూల బావిలో స్నానం చేసేందుకు శివానంద్ దిగి నీట మునిగిపోయాడు. ఒడ్డుపై ఉన్న వ్యక్తి భయంతో గ్రామానికి చేరుకొని జరిగిన విషయాన్ని గ్రామస్తులకు తెలిపాడు. గ్రామస్తులు ఘటన స్థలానికి చేరుకొని బావిలో శివానంద్ మృతదేహాన్ని బయటకి తీశారు. పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని మృతదేహానికి పంచనామా నిర్వహించారు. పోస్టుమార్టం నిమిత్తం బాన్సువాడ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి



లక్ష్మణ్(ఫైల్)

నాగిరెడ్డిపేట: మండలంలోని నాగిరెడ్డిపేట గ్రామానికి చెందిన మంగలి లక్ష్మణ్(23)అనే యువకుడు హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. ఎస్సై మల్లారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన మంగలి లక్ష్మణ్‌కు గత ఏప్రిల్‌లో సంగారెడ్డి జిల్లా రాయికోడ్ గ్రామానికి చెందిన మౌనికతో వివాహం జరిగింది. దీపావళికి లక్ష్మణ్ గత నెల 27న భార్యతో కలిసి అత్తగారింటికి వెళ్లాడు. 29న తండ్రి చంద్రయ్య లక్ష్మణ్‌కు ఫోన్‌చేసి ఇంటికి చెప్పాడు. అదే రోజు ఇంటికి వచ్చిన లక్ష్మణ్ పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. గమనించిన కుటుంబీకులు మెరుగుచికిత్స నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ ఉదయం మృతి చెందాడు. లక్ష్మణ్ భార్య మౌనిక ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

గాంధారిలో మరొకరు..



రాజు(ఫైల్)

గాంధారి: హైదరాబాద్‌లో చికిత్స పొందుతూ మండల కేంద్రానికి చెందిన సింధె రాజారావు అలియాస్ రాజు(42) ఆదివారం మృతి చెందాడు. వివరాలిలా ఉన్నాయి. మండల కేంద్రానికి చెందిన రాజు ఈ నెల 6న గుడిమెట్ నుంచి గాంధారి వైపు బైక్‌పై వస్తుండగా రోడ్డు పక్కన చెట్టును ఢీకొన్నాడు. ఈ ఘటనలో అతనికి తీవ్రగాయాలు కావడంతో చికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు తరలించారు. చికిత్స పొందుతూ ఉదయం మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

కుటుంబ కలహాలతో ఒకరి ఆత్మహత్య

తాడ్వాయి: కుటుంబ కలహాలతో ఒకరు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటన తాడ్వాయి మండలంలోని చందాపూర్‌లో చోటు చేసుకుంది. ఎస్సై వెంకటేశ్వర్లు ఆదివారం తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన చాకలి సాయిలు(43) మద్యానికి బానిసయ్యాడు. చేసిన అప్పులు సైతం పెరగడంతో కుటుంబంలో గొడవలు మొదలయ్యాయి. ఈనెల 4న రాత్రి మద్యం తాగి పంటకు వచ్చిన డబ్బులు ఇవ్వాలంటు భార్యతో గొడవ పడ్డాడు. 5న ఉదయం మరోసారి భార్యతో గొడవపడి ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. అతని కోసం పలు చోట్ల గాలించినా ఆచూకీ లభించలేదు. ఆదివారం ఉదయం చందాపూర్ శివారులోని వ్యవసాయ భూమిలో చెట్టుకు ఉరేసుకొని సాయిలు విగతజీవిగా కనిపించాడు. మృతుడి భార్య రాజమణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కామారెడ్డి ఏరియా ఆస్పత్రికి తరలించినట్లు ఎస్సై పేర్కొన్నారు.

తల్లి, కూతురు అదృశ్యం

కామారెడ్డి క్రైం: మండలంలోని ఓ గ్రామానికి చెందిన తల్లీ, కుమార్తె అదృశ్యమైనట్లు దేవునిపల్లి ఎస్సై రాజు ఆదివారం తెలిపారు. కుటుంబ తగాదాల నేపథ్యంలో ఓ వివాహిత తన కుమార్తెతో కలిసి రెండు రోజుల క్రితం ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబీకులు పలు చోట్ల గాలించినా ఆచూకీ లభించలేదు. భర్త ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

పేకాట స్థావరంపై దాడి

ఆర్మూర్‌టౌన్: ఆలూర్ మండల కేంద్రంలోని పేకాట స్థావరంపై దాడి చేసినట్లు ఎస్‌హెచ్‌వో సత్యనారాయణగౌడ్ ఆదివారం తెలిపారు. పేకాట ఆడుతున్న ముగ్గురిని పట్టుకోగా వారి నుంచి రూ. 23,610 నగదు, 4 సెల్‌ఫోన్లు, 3 బైక్‌లను స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. వీరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌హెచ్‌వో తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఆరుగురికి గాయాలు

నవీపేట: మండల కేంద్రంలోని కందకుర్తి రోడ్డులో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆరుగురికి గాయాలైనట్లు ఎస్సై వినయ్ తెలిపారు. నవీపేట్ నుంచి సాటాపూర్ వైపు వెళ్తున్న ట్రాలీ ఆటో స్పీడ్ బ్రేకర్ వద్ద మెల్లిగా ఆగింది. ఈ క్రమంలో వెనుక నుంచి వేగంగా వస్తున్న కారు ఆటోను ఢీకొన్నది. దీంతో కారు డ్రైవర్‌తో పాటు ఆటోలో ప్రయాణిస్తున్న అయిదుగురికి గాయాలయ్యాయి. క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

గోదాంపై పోలీసుల దాడి

ఖలీల్‌వాడి: నగరంలోని అశోక్‌నగర్ ప్రాంతంలో పీడీఎస్ బియ్యాన్ని నిల్వ ఉంచిన గోదాంపై శనివారం రాత్రి దాడి చేసినట్లు ఎస్‌హెచ్‌వో రఘుపతి ఆదివారం తెలిపారు. అశోక్‌నగర్ ప్రాంతంలోని సుల్తాన్, సుమేర్ నిర్వహిస్తున్న గోదాంపై దాడి చేయగా లారీలో రెండు టన్నులకు పైగా ఉన్న పీడీఎస్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. బియ్యాన్ని రేషన్‌షాపుల వద్ద తమ ఏజెంట్లను నియమించుకుని కొనుగోలు చేయగా మరికొన్ని ప్రాంతాల్లో గ్రామాల వారిగా బియ్యాన్ని కొనుగోలు చేసి ఇతర రాష్ట్రాలకు రీసైక్లింగ్ కోసం తరలించినట్లు గుర్తించారు. వీరిపై గతంలో కేసు ఉన్నట్లు తెలిసింది.

లారీ నుంచి డీజిల్ అపహరణ



భిక్కనూరు: బ్యాటరీ పేలడంతో రోడ్డుపై నిలిచిన లారీ నుంచి డీజిల్‌ను దొంగలు అపహరించుకెళ్లిన ఘటన మండల కేంద్రంలోని టోల్ ప్లాజా సమీపంలో ఆదివారం వేకువ జామున జరిగింది. వివరాలిలా ఉన్నాయి. ఉత్తరప్రదేశ్ నుంచి హైదరాబాద్ వెళ్తున్న లారీ బ్యాటరీ అకస్మాతుగా పేలడంతో ఆదివారం వేకువ జామున టోల్‌ప్లాజా సమీపంలో నిలిచిపోయింది. లారీని రోడ్డు పక్కన నిలిపేలా చేసి డ్రైవర్, క్లీనర్ నిద్ర పోయారు. ఉదయం లేచి చూసే సరికి డీజిల్ ట్యాంక్ మూత ధ్వంసమై ఉండటాన్ని గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. సుమారు 300 లీటర్ల డీజిల్ చోరీకి గురైనట్లు డ్రైవర్ ఫిర్యాదులో పేర్కొన్నారు.

కాపర్, ఆయిల్ చోరీ

నవీపేట: మండలంలోని నాగేపూర్ శివారులోని రెండు ట్రాన్స్‌ఫార్మర్లను గుర్తు తెలియని దుండగులు ధ్వంసం చేసినట్లు ఎస్సై వినయ్ ఆదివారం తెలిపారు. రెండు ట్రాన్స్‌ఫార్మర్లను దుండగులు ధ్వంసం చేసి అందులో ఉన్న కాపర్ కాయిల్స్, ఆయిల్‌ను చోరీ చేశారు. లైన్‌మన్ నవీన్‌కుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.